సాక్షి
వికారాబాద్
మంగళవారం । 31 । డిసెంబర్ । 2024



బాలికల ఆత్మరక్షణకు శిక్షణ

బాలికల స్వీయ రక్షణ కోసం ప్రభుత్వం పాఠశాలల్లో శిక్షణ ఇచ్చేందుకు నిధులు మంజూరు చేసింది.

8లో▸



హక్కులపై అవగాహన..

పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా నవాబుపేట మండలం మాదిరెడ్డిపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

8లో▸



కొనసాగుతున్న ఇళ్ల సర్వే

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందుతాయని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్ అన్నారు.

9లో▸

పెరిగిన నేరాలు

YEAR 2024 Crime ROUNDUP

గత ఏడాదితో పోలిస్తే ఈసారి క్రైంరేట్ అధికం

- సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం
- లగచర్ల ఘటనతో ఉలిక్కిపడిన జిల్లా
- దేశవ్యాప్తంగా సంచలనం
- పెరిగిన రోడ్డు ప్రమాదాలు.. అదే స్థాయిలో మృతులు



లగచర్ల ఘటనతో గ్రామంలో మోహరించిన పోలీసులు (ఫైల్)

వికారాబాద్: గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరంలో నేరాలు బాగా పెరిగాయి. నిఘా వ్యవస్థల వైఫల్యం కూడా నేరాలు పెరగడానికి కారణమని తెలుస్తోంది. ఆత్మహత్యలు, ప్రమాదాల హాట్‌స్పాట్ల గుర్తింపు, త్వరితగతిన స్పందించడంతో కొన్ని రకాల నేరాలు తగ్గాయని చెప్పవచ్చు. కొన్ని చోట్ల సివిల్ తగాదాల్లో పోలీసులు తలదూర్చారన్న ఆరోపణలు వచ్చాయి. ప్రధానంగా చన్గొముల్, వికారాబాద్, నవాబుపేట, మోమిన్‌పేట, తాండూరు, ధారూరు, పరిగి పోలీస్ స్టేషన్ల పరిధిలో సివిల్ మ్యాటర్స్‌లో పోలీసుల జోక్యంపై విమర్శలు వచ్చాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, మిస్సింగులు, ప్రమాదాలు పెరగడం పోలీసులకు సవాలుగా మారింది. గుట్కా, గంజాయి విక్రయాలు, ఇసుక, కలప అక్రమ రవాణా, రేషన్ బియ్యం అక్రమ రవాణాను కట్టడి చేయలేకపోయారనే అపవాదు మూటగట్టుకున్నారు. ఈ ఏడాది సీసీ టీవీల ఏర్పాటులోనూ పోలీసులు వెనకబడ్డారనే చెప్పవచ్చు. ప్రమాదాలు, మృతుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తోంది.

లగచర్ల ఘటనతో..

కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలం లగచర్ల ఘటనతో జిల్లా ఉలిక్కి పడింది. ఈ ఏడాది నవంబర్ 11న లగచర్ల గ్రామంలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, కడా ప్రత్యేక అధికారి, డీఎస్పీ సహా ఇతర అధికారులపై జరిగిన దాడి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనలో అడిషనల్ కలెక్టర్‌కు స్వల్ప గాయాలు కాగా.. కడా ప్రత్యేక అధికారి, డీఎస్పీ తీవ్రంగా గాయపడ్డారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి తోపాటు 26 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 110 మంది వరకు దాడిలో పాల్గొన్నట్టు ప్రాథమిక విచారణలో తేల్చిన పోలీసులు 42 మంది పేర్లను రిమాండ్ రిపోర్టులో పొందుపర్చారు. అయితే భూములు ఇవ్వమన్నందుకు రైతులను అరెస్టు చేసి జైలుకు పంపారని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశాయి. దీంతో ప్రభుత్వం వెనక్కు తగ్గి ఫార్మాసిటీ స్థానంలో మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది.

భూ వివాదాల్లో ఖాకీల జోక్యం

ఇటీవలి కాలంలో చాలా వరకు ఫిర్యాదులు ఎఫ్ఐఆర్ నమోదు కాకుండానే బుట్టదాఖలవుతున్నాయి. పోలీస్ స్టేషన్లలో నేతల ప్రభావం పెరిగిపోవడంతో.. వారి ఒత్తిళ్లకు తలొగ్గి వచ్చిన ఫిర్యాదుల్లో చాలా వరకు పక్కన పడేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చన్గొముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భూ కబ్జాదారులకు పోలీసులు కొమ్ముకాస్తున్నారని ఓ వ్యక్తి గన్నుతో బెదిరిస్తే పోలీసులు నేరస్తులకే సపోర్టు చేస్తున్నారని బీజేపీ నేతలు ఆందోళనకు దిగారు. ఇందులో ఎస్ఐ ప్రమేయం ఉందనే ఆరోపణలు రాగా.. చివరకు ఓ హెడ్ కానిస్టేబుల్, హోంగార్డుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.



లగచర్ల ఘటనపై విచారణ చేపట్టేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్(ఫైల్)

ఇసుక మాఫియాతో కుమ్మక్కు !

తాండూరు సబ్ డివిజన్ పోలీసులు ఇసుక మాఫియాతో కుమ్మక్కవడం ఆ శాఖలో చర్చనీయాంశం అయ్యింది. ఇసుక మాఫియాతో అంటకాగుతున్న ముగ్గురు పోలీసు అధికారులపై చర్యలు తీసుకున్నారు. తాండూరు సబ్ డివిజన్‌లో పోలీసులు ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు మొదటి నుంచి ఉన్నాయి.

నూతన వేడుకలు | శ్రుతిమించొద్దు



- నిబంధనలకు లోబడే సంబరాలు జరుపుకోవాలి
- మన ఆనందం మరొకరికి ఇబ్బంది కారాదు
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేధం
- ప్రత్యేక బృందాలతో గస్తీ ఉంటుంది
- పిల్లల కదలికలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి
- న్యూ ఇయర్ వేడుకలపై 'సాక్షి'తో ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్: కాలచక్రం గిర్రున తిరిగింది. అప్పుడే మరో ఏడాది గడిచిపోయింది. 2024 సంవత్సరం నేటితో ముగియనుంది. కొత్త సంవత్సరం 2025 రానే వచ్చింది. న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించేందుకు యువతీ యువకులు, ప్రజలు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులు ఓ పక్క జాగ్రత్తలు సూచిస్తూనే బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల నిర్వహణ ఎలా ఉండాలి.. ఎలాంటి నిబంధనలు పాటించాలి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం సాక్షికి వివరించారు.

సాక్షి : న్యూ ఇయర్ వేడుకలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఎస్పీ నారాయణరెడ్డి: నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ, అశ్లీల సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ప్రత్యేక కార్యక్రమాలు చేయాలనుకుంటే ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలి. డీజేలు, ప్రజలకు ఇబ్బంది కలిగించే కార్యక్రమాలకు అనుమతి లేదు. నేటి(మంగళవారం) రాత్రి 8గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా పోలీసు గస్తీ ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం.

సాక్షి: వేడుకల నేపథ్యంలో ప్రజలకు మీరిచ్చే సూచనలు ఏమిటి?

ఎస్పీ: వేడుకల్లో స్వీయ నియంత్రణ అనేది సామాజిక బాధ్యత. శాంతిభద్రతల పరిరక్షణలో అందరి భాగస్వామ్యం అవసరం. ప్రజల సంక్షేమం కోసమే నిబంధనలు, చట్టాలు అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. మన ఆనందం కోసం ఇతరును ఇబ్బంది పెట్టేలా వ్యవహరించరాదు. తోటి వారికి ఇబ్బంది కలిగించినా.. అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా ఉపేక్షించం. వేడుకలు శ్రుతిమించితే డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.

సాక్షి : ప్రధానంగా యువతకు ఏం చెబుతారు?

ఎస్పీ: శాంతిభద్రతలకు భంగం కలగకుండా పోలీసులు చేపట్టే చర్యలకు యువత సహకరించాలి. కట్టుదిట్టమైన ఆంక్షలేమి లేనప్పటికీ ఆర్భాటాలకు దూరంగా ఉండటం మంచిది. సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెట్టాం. వేడుకల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. అర్ధరాత్రి రోడ్లపై గుంపులుగా తిరగరాదు.

సాక్షి : తల్లిదండ్రులు ఏం చేయాలి..?

ఎస్పీ : ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల కదలికలపై దృష్టి పెట్టాలి. ఏదైనా జరగకూడనిది జరిగాక బాధ పడి ప్రయోజనం ఉండదు. ఈ విషయాన్ని గుర్తించాలి. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటాం. పోలీసుల తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాలపై తల్లిదండ్రులు పిల్లలకు సూచనలు చేయాలి. వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి. ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆనందంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి.

సాక్షి : రిసార్ట్స్, ఈవెంట్స్ నిర్వాహకులకు ఎలాంటి ఆదేశాలు జారీ చేశారు?

ఎస్పీ : ఇప్పటికే రిసార్ట్స్ నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. అసాంఘిక కార్యకలాపాను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించం. పోలీసు నిబంధనలు కచ్చితంగా పాటించాలి.. వేడుకలు అదుపుతప్పితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలి..

సాక్షి : ఆకతాయిల చేష్టలపై ఎలా వ్యవహరిస్తారు?

ఎస్పీ : పోలీసులు తమ సంతోషాలను, కుటుంబాలతో గడిపే సందర్భాలను త్యాగం చేసి ప్రజలకోసమే పని చేస్తున్నారనే విషయాన్ని గుర్తుపెట్టుకొని ప్రతి ఒక్కరూ సహకరించాలి. అలాగే జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు..

న్యూస్‌రీల్

పటిష్ట చర్యలు చేపట్టాం

- ఈ ఏడాది 888 కేసులు నమోదు చేశాం
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్



అనంతగిరి: జిల్లాలో బెల్టుషాపుల నిర్వహణ, మద్యం అక్రమ రవాణా, అమ్మకాలు, గుడుంబా తయారీపై పటిష్ట చర్యలు చేపట్టినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2024 సంవత్సరంలో 888 కేసులు నమోదు చేశామని, ఇందులో ప్రమేయం ఉన్న 350 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీ, సరఫరాకు పాల్పడిన వారిపై 354 కేసులు నమోద చేయగా 184 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. లైసెన్స్ లేకుండా కల్లు విక్రయించడంపై 142 కేసులు నమోదు చేసి 36 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. బెల్టుషాపులకు సంబంధించి 119 కేసులు నమోదు చేసి 86 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. కల్తీ కల్లు కేసులు ఆరు నమోదైనట్లు వివరించారు. గంజాయి, డ్రగ్స్ కేసుల్లో 26 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. 165 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత ఏడాది దాదాపు రూ.668 కోట్లుగా ఉన్న మద్యం అమ్మకాలు ప్రస్తుత సంవత్సరంలో దాదాపు రూ.728 కోట్లుగా నమోదైనట్లు తెలిపారు.

ప్రజావాణికి 79 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం 79 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

12 క్లినిక్‌లపై కేసులు

జిల్లా వైద్యాధికారి వెంకటరవణ

అనంతగిరి: జిల్లాలో గడిచిన నెల రోజుల్లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్, విజిలెన్స్ టీం ఆధ్వర్యంలో క్లినిక్‌లు, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా వైద్యాధికారి వెంకటరవణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లు, స్థాయికి మించి వైద్యం చేస్తున్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లు తాండూరులో 7, పరిగిలో 2, వికారాబాద్‌లో 3 సెంటర్లపై కేసులు నమోదు చేశామని తెలిపారు. నిబంధనలు పాటించని ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, క్లినిక్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాసబ్ చెరువును పరిశీలించిన హైడ్రా బృందం

తుర్కయంజాల్: హైడ్రా అధికారుల బృందం మున్సిపల్ పరిధిలోని మాసబ్ చెరువును ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించింది. చెరువు చుట్టూ తిరిగి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిని పరిశీలించిన అనంతరం ఆదిత్యా నగర్ కాలనీలో కాలనీ వాసులతో అధికారులు ముచ్చటించారు. మీరు ఎప్పటి నుంచి ఇక్కడ నివాసం ఉంటున్నారు.. ప్లాట్లను ఎప్పుడు కొనుగోలు చేశారు అని అడిగి తెలుసుకున్నారు. వెంచర్‌కు సంబంధించిన డ్యాక్యుమెంట్లు తీసుకుని హైడ్రా కార్యాలయానికి రావాలని కోరినట్లు సమాచారం. కార్యక్రమంలో హైడ్రా విచారణ అధికారి బాచిరెడ్డి, ఇరిగేషన్ డీఈఈ చెన్న కేశవరెడ్డి, ఏఈఈ వంశీ, అబ్దుల్లాపూర్‌మెట్ మండల సర్వేయర్ జ్యోతి పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో కాకతీయుల ఆనవాళ్లు

కొత్తూరు: మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్‌లో కాకతీయుల ఆనవాళ్లు ఉన్నట్లు పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి అన్నారు. నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పట్నం కృష్ణంరాజు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన సోమవారం గ్రామంలో పర్యటించారు. వారం రోజుల క్రితం ఓ రైతు పొలంలో గుర్తించిన పురాతన రాతి నంది విగ్రహాన్ని గ్రామస్తులు పురావస్తు శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. విగ్రహాన్ని పరిశీలించిన ఆయన క్రీ.శ 13వ శతాబ్దానికి చెందినదిగా తెలిపారు. నంది విగ్రహం లభ్యమైన ప్రాంతంలోనే నాలుగేళ్ల క్రితం శివలింగం కూడా బయ టపడడంతో సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. 13వ శతాబ్దంలో కాకతీయులు ఈ పరిసరాల్లో తిరిగిన ఆనవాళ్లకు చిహ్నంగానే ఈ విగ్రహాలు లభ్యమైనట్లు వివరించారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రైతు కన్నీరు రాష్ట్రానికి అరిష్టం

- వారికి ఎర్ర జెండా అండగా ఉంటుంది
- లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి
- హకీంపేట్ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

దుద్యాల్ : రైతు కంట కన్నీరు కారేలా ప్రభుత్వం వ్యవహరిస్తే రాష్ట్రానికి అరిష్టం కలుగుతుందని.. వారికి అన్యాయం చేయరాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం దుద్యాల్ మండలం హకీంపేట్‌లో నిర్వహించిన రైతాంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లగచర్ల ఘటనలో రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎలాంటి షరతులు లేకుండా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ రద్దు కోసం సీపీఎం ఎంతో పోరాటం చేసిందని గుర్తుచేశారు. సమస్యను సీఎంకు వివరిస్తే ఫార్మా స్థానంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. పారిశ్రామిక వాడకు బలవంతంగా భూములు తీసుకోరాదని సూచించారు. రైతులు అంగీకరిస్తేనే భూములు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతంలో కొడంగల్‌కు చెందిన బడా నాయకుల భూములు ఉన్నాయని, వాటిని వదిలేసి గిరిజనుల భూములు తీసుకుంటే ఊరుకోమన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు

ప్రస్తుతం అనుభవిస్తున్న రిజర్వేషన్లు, పదవులు అంబేడ్కర్ పుణ్యమే అని తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశంలో అన్ని కులాలు, వర్గాలకు పదవులు అందుతున్నాయంటే అంబేడ్కర్ పెట్టిన భిక్షే అని గుర్తుచేశారు. అలాంటి మహనీయుడిపై అమిత్ షా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. వెంటనే ఆయన్ను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ, డీజీ నరసింహా రావ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్‌రాములు, జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, శ్రీనివాస్, బుగ్గప్ప, సుదర్శన్, సతీష్, నర్సమ్మ, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా, పద్మశ్రీ డా.ఖాదర్ వలీ

శంకర్‌పల్లి: నిత్యం చిరు ధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, జీవనశైలిని పొందొచ్చని మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా, పద్మశ్రీ డా.ఖాదర్ వలీ అన్నారు. మండల పరిధిలోని దొంతాన్ పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ ఉమెన్ డెవలప్‌మెంట్ (సీడబ్ల్యూడీ), క్లబ్ ఐనా ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచంలో చాలా మంది బియ్యం, గోధుమలతో చేసిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటున్నారని, వీటితో అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నట్లు స్పష్టం చేశారు. నిత్యం మనం తీసుకొనే ఆహారంలో క్రమం తప్పకుండా చిరు ధాన్యాలను చేర్చాలని సూచించారు. తద్వారా అనేకమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయన్నారు. డయాబెటీస్, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఫిజియోథెరపిస్ట్, యోగా థెరపిస్ట్ డా. పి.విజయ్‌కుమార్, వైస్ చాన్సలర్ డా.ఎల్.ఎస్ గణేశ్, రిజిస్ట్రార్ డా.ఎస్.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డా. ఖాదర్ వలీ

లగచర్ల ఘటన దురదృష్టకరం

- అది కొందరు కావాలని చేసిందే..
- వసతి గృహాల్లో వసతుల కల్పనకు కృషి
- నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు
- అట్టడుగు వర్గాలకు వైద్యం అందేలా చూస్తాం
- మీడియా చిట్‌చాట్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్



హాస్టళ్లలో చేపట్టిన పనులను ఫొటోల ద్వారా మీడియాకు వివరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్: 'లగచర్ల ఘటన దురదృష్టకరం.. ఇలాంటి ఘటన గతంలో ఎప్పుడూ చూడలేదు.. జరగలేదు.. ఇకమీద కూడా చూడకూడదు'.. అని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం ఆయన అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్డీఓ శ్రీనివాస్‌తో కలిసి తన చాంబర్‌లో మీడియాతో చిట్‌చాట్‌గా చేశారు. మీడియాతో పంచుకున్న విషయాలు ఆయన మాటల్లోనే.. లగచర్ల లాంటి ఘటన గతంలో ఎక్కడా జరగలేదు. అది రైతులు చేసింది కాదు.. కొన్ని శక్తులు ప్రేరేపిస్తే రైతుల ముసుగులో కొందరు కావాలనే చేశారు.. నేనైనేనుగా వాళ్ల దగ్గరికి వెళ్లలేదు.. రైతుల ముసుగులో వచ్చి గ్రామంలోకి రావాలని బతిమాలితేనే వెళ్లాను.. మన ప్రజల్ని మనం నమ్మకపోతే ఎలా..? నమ్మాలి కదా..? అక్కడికి వెళ్లాక నేను ఏమీ మాట్లాడకుండానే దాడి ప్రారంభించారు.. నేను మాట్లాడాక నా మాటలు వారికి ఆమోదయోగ్యం లేకుంటే వాదించాలి. మాకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండానే దాడి చేశారు.. భూ సేకరణ అనేది ఇదే మొదటి కాదు.. ఇదే చివరిది కూడా కాదు.. ఇది అభివృద్ధిలో భాగం కదా..? అన్నారు.

వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి

కల్పనకు కృషి చేస్తున్నాం

జిల్లాలో వివిధ రకాల 96 వసతి గృహాలు ఉన్నాయి.. వీటిలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం.. బేసిక్ అవసరాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం రూ.96 లక్షలు ఖర్చు చేశాం. ప్రధానంగా తలుపులు, కిటికీలు సక్రమంగా ఉండేలా చూడటం.. మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించాం.. అన్ని వసతి గృహాల్లో తాగునీటి సౌకర్యం మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకున్నాం.. ఎక్కువ వెలుతురు ఇచ్చే లైట్లు ఏర్పాటు చేశాం. అవసరమైన చోట ఫ్యాన్లు ఏర్పాటు చేయించాం. హాస్టళ్లలో ఫుడ్‌పాయిజన్ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నాం. మీడియా కూడా సంయమనం పాటించాలి.. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు విద్యార్థుల ఫొటోలు ప్రచురించకుండా చూడాలన్నారు.

విద్య, వైద్యంపై ఫోకస్

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఒక్కో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ 20 పాఠశాలలను పర్యవేక్షించాల్సి వచ్చేది. దీంతో ఎలాంటి ప్రయోజనం ఉండదు.. మళ్లీ వారి పనులు కూడా చేసుకోలేరు.. అందుకే ఐదు నుంచి ఆరు స్కూళ్ల బాధ్యతలు అప్పగించాం. బోధనపై దృష్టి సారించడంతో పాటు విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. వైద్య సేవల్లో రాజీ పడం. నవాబుపేట పీహెచ్‌సీని మోడల్ పీహెచ్‌సీగా అభివృద్ధి చేస్తున్నాం.. మిగిలిన వాటిని కూడా అభివృద్ధి చేస్తాం. జిల్లాలోని తాండూరు, వికారాబాద్‌లో పెద్దాస్పత్రులు ఉన్నాయి. వాటిని ప్రజలు వినియోగించుకోవాలి. ధరణి పెండింగ్ దరఖాస్తులను 15వేల నుంచి 6వేలకు తగ్గించాం.. నా లాగిన్‌లో అయితే కేవలం 300 మాత్రమే పెండింగ్ ఫైళ్లు ఉన్నాయి. గతంలో అన్ని ఫైళ్లు నా లాగిన్‌కే వచ్చేవి.. ఇప్పుడు తహసీల్దార్లు, ఆర్డీఓలు, అడిషనల్ కలెక్టర్ ఎవరి స్థాయిలో వారు ఫైళ్లను క్లియర్ చేస్తున్నారు. పెండింగ్ దరఖాస్తులను మరింత తగ్గించేందుకు కృషి చేస్తున్నాం.



పూజలో పాల్గొన్న జడ్జి శిల్ప తదితరులు

రామలింగేశ్వరుడి సన్నిధిలో పరిగి కోర్టు జడ్జి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని పరిగి సివిల్ కోర్టు న్యాయమూర్తి శిల్ప అన్నారు. సోమవారం మండలంలోని బండవెల్కిచర్లలో వెలసిన శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆధ్యాత్మిక చింతనతో మానశిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొట్ల మైపాల్ రెడ్డి, ప్రభాకర్, అంజిలయ్య, నర్సింలు, గోపాల్‌రెడ్డి, అర్చకులు దశరథం, పాండు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ – తుక్కుగూడకు ఏరో రైడర్ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ ఎయిర్‌పోర్టుతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగుల కోసం శంషాబాద్ బస్‌స్టేషన్ నుంచి తుక్కుగూడ వరకు ఏరో రైడర్ ఆర్డినరీ బస్సులను జనవరి 1వ తేదీ నుంచి నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎయిర్‌పోర్టులో పనిచేసే ఉద్యోగులు, కార్గోసంస్థలు, ఫార్మాసంస్థల్లో పని చేసే వారు ఈ బస్సులను వినియోగించుకోవచ్చు. రూ.1,150కు నెలవారీ బస్‌పాస్‌లు పొందొచ్చు. శంషాబాద్ బస్‌స్టేషన్ నుంచి మొదటి బస్సు ఉదయం 6గంటలకు, చివరి బస్సు సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరుతుంది. తుక్కుగూడ నుంచి మొదటి బస్సు ఉదయం 6 గంటలకు, చివరి బస్సు సాయంత్రం 6.15 గంటలకు బయలుదేరుతుందని అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

అడిషనల్ ఎస్పీ టీవీ హనుమంతరావు

అనంతగిరి: బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని అడిషనల్ ఎస్పీ టీవీ హనుమంతరావు హెచ్చరించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జనవరి మాసంలో నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్–11 కార్యక్రమంపై అనుబంధ శాఖల అధికారులతో కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు అధికారులు, పోలీసులు, కార్మిక, స్వచ్ఛంద సంస్థలు, పిల్లల సంక్షేమ కమిటీ, చైల్డ్‌లైన్ ప్రతినిధులతో సమన్వయంతో పని చేసి బాలకార్మికులు లేకుండా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వెంకటేశ్, సీసీఐ సీఐ ఆంజనేయులు, అన్వర్‌పాషా, ఆయా సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడిగా కృష్ణ



నియామకపత్రాలతో మాల సంఘాల జేఏసీ కమిటీ సభ్యులు

తాండూరు టౌన్: నియోజకవర్గ పరిధిలోని మాల సంఘాల ఐక్యత, బలోపేతానికి కృషి చేస్తానని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు బి.కృష్ణకుమార్ అన్నారు. సోమవారం నియోజకర్గ జేఏసీ నూతన కమిటీ సభ్యులకు రాష్ట్ర చైర్మన్ చెరుకు రాంచందర్ నియామకపత్రాలు అందజేశారు. కమిటీ ఉపాధ్యక్షులుగా శేఖర్, రాములు, ప్రధాన కార్యదర్శులుగా గోవింద్, నర్సింలు, కార్యదర్శులుగా లాలప్ప, రాములు, సురేశ్, విష్ణు కోశాధికారిగా నర్సింలు, సలహాదారులుగా మల్లప్ప నియమితులయ్యారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో లొల్లి

ఎమ్మెల్యే వద్దకు పంచాయితీ

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల కమిటీలో లొల్లి పుట్టింది. నెల రోజుల క్రితం గ్రామాల వారీగా ఈ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో చెన్‌గేస్‌పూర్ ఇందిరమ్మ కమిటీలో గ్రామస్తుల సమక్షంలో శ్రీశైలంగౌడ్, వెంకటేశ్, శ్రీనివాస్ రెడ్డి, మాల ఇందిరమ్మ, కుర్వ లక్ష్మి పేర్లను ప్రతిపాదించి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి పంపించారు. జాబితాలో కుర్వ లక్ష్మి పేరుకు బదులుగా మరో లక్ష్మి పేరు ప్రత్యక్షమైంది. ఇదే విషయం వాట్సాప్‌లో చక్కర్లు కొట్టింది. దీంతో విషయం తెలుసుకున్న కుర్వ లక్ష్మి భర్త కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లప్ప ఆదివారం రాత్రి విషయాన్ని ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లాడు. మీ వెంట ఉన్న వారు మిమ్ములను తప్పుదోవ పట్టిస్తున్నారని.. నిజమైన కాంగ్రెస్ నేతలను గుర్తించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తాండూరు మండల పరిధిలో పాత, కొత్త కాంగ్రెస్ నేతల మధ్య వర్గపోరుకు ఫుల్‌స్టాప్ పెట్టాలని పలువురు నేతలు కోరుతున్నారు.

బంజారా భవన్ శిలాఫలకం ధ్వంసం

చర్యలు తీసుకోవాలని డిమాండ్



దుండగులు ధ్వంసం చేసిన శిలాఫలకం

పరిగి: బంజారా భవన్ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, బంజారా సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వివరాలు.. ప్రభుత్వం బంజారా భవన్ నిర్మాణానికి రూ.2కోట్ల నిధులు కేటాయించింది. దీంతో ఈ నెల 15న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి 10వ వార్డులో ఈ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో కాంగ్రెస్ శ్రేణులు, గిరిజన సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు తైక్వాండోలో శిక్షణ ఇస్తున్న మాస్టర్‌లు



తైక్వాండో శిక్షణలో బాలిక

బాలికల ఆత్మరక్షణకు శిక్షణ

- ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నెలలపాటు ట్రైనింగ్
- 186 పాఠశాలలకు రూ.27.90లక్షల నిధుల మంజూరు
- 28వేల మంది బాలికలకు యుద్ధ విద్యలో తర్ఫీదు

తాండూరు: బాలికలు స్వీయ రక్షణ పొందేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మరక్షణ విద్యపై శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆగస్టు 29న బాలికలకు తైక్వాండోపై శిక్షణ ఇచ్చేందుకు జీఓ జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న బాలికలకు మూడు నెలలపాటు రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షా సంరక్షణ–ఆత్మరక్షణ పేరిట నిర్వహించే కార్యక్రమానికి కావాల్సిన నిధులు మంజూరు చేసింది. సెప్టెంబర్ 15 నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు శిక్షణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 186 ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చేందుకు నెలకు రూ.5వేల చొప్పున రూ.15వేలు చెల్లించాలని ఉత్వర్వుల్లో పొందుపరిచారు. ఇందుకు గాను ప్రభుత్వం నుంచి రూ.27.90లక్షల నిధులు కేటాయించారు. జిల్లాలోని 20 మండలాలు ఉండగా కొన్ని మండలాల్లో బాలికలకు ఆత్మరక్షణ విద్యపై శిక్షణ కల్పిస్తున్నారు.

186 పాఠశాలల ఎంపిక

వికారాబాద్ జిల్లాలో మొత్తం 1032 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలున్నాయి.. వీటిలో 186 పాఠశాలలను ఎంపిక చేసిన ప్రభుత్వం బాలికలకు స్వీయ రక్షణకు 'రాణి లక్ష్మీ బాయి ఆత్మరక్ష–సంరక్షణ' కార్యక్రమాన్ని ప్రారంభించింది. తైక్వాండో విద్యలో నిష్ణాతులైన మాస్టర్‌లతో బాలికలకు శిక్షణ ఈ నెల మొదటి వారం నుంచి ప్రారంభించారు.

మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ

బాలికలకు, యువతులు, మహిళల కోసం ఎన్ని చట్టాలున్నా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పోకిరీల వేధింపులు నిత్యకృత్యమయ్యాయి. షీటీం ఏర్పాటు చేసినా దాడులు ఆగడం లేదు. ఇలాంటి పరిస్థితుల నుంచి బాలికలు తమను తాము రక్షించేందుకు మార్షల్‌ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు రెండు నెలలే ఉన్న పలు పాఠశాలల్లో ఇప్పటి వరకు శిక్షణ తరగతులను ప్రారంభించలేదు.

ప్రతీ పాఠశాలకు రూ.15వేలు

ప్రభుత్వ పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్‌లోని కుంగ్‌ఫూ, కరాటే(తైక్వాండో), జూడో విద్య నేర్పించేందుకు ట్రైనర్‌కు ఇచ్చేందుకు ప్రతీ పాఠశాలకు రూ.15వేల చొప్పున ప్రభుత్వం నిధులను అందిచనుంది. ఎంపిక చేసిన 186 ప్రభుత్వ పాఠశాలల్లో 28 వేల మంది బాలికలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణను అందించనున్నారు.

మూడు నెలల ట్రైనింగ్



బాలికలకు ఆత్మరక్షణ విద్యపై శిక్షణ కల్పించేందుకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. మండల విద్యాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఈ నెల మొదటి వారం నుంచి శిక్షణ ప్రారంభమైంది. మిగిలిన ఎంపిక చేసిన పాఠశాలల్లో వచ్చే వారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తాం. వారంలో మూడు రోజుల పాటు ఒక్కో పాఠశాలల్లో శిక్షణ ఇవ్వాలి

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి

కొంగుకు కట్టేసుకున్న బాలుడి అదృశ్యం

- తాండూరు మండలం గౌతాపూర్‌లో ఘటన
- బాధితుల స్వస్థలం కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్
- దర్యాప్తు ముమ్మరం చేసిన కరన్‌కోట్ పోలీసులు



అదృశ్యమైన బాలుడు హుస్సేన్(ఫైల్)

తాండూరు రూరల్: తల్లి పక్కనే పడుకున్న ఓ ఏడాది బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతపూర్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, బాధితుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం చిత్తాపూర్‌కు చెందిన బాష, గోరేబీ దంపతులు. వీరికి ముగ్గురు కొడుకులు ఇమామ్(10), మక్తూమ్(8), హుస్సేన్, కూరుతు రాజ్‌బీ(5) సంతానం. బాష గ్యాస్ స్టౌలు, కుక్కర్లు మరమ్మతులు చేస్తుండగా, గోరేబీ చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి జీవనం సాగిస్తున్నారు. పొద్దంతా పని చేసుకుని రాత్రి వేళ గౌతాపూర్ మల్లికార్జున స్వామి ఆలయం వద్ద బసచేస్తారు. గోరేబీ చెల్లి, తల్లి సైతం ఇక్కడే ఉంటున్నారు. రోజూ మాదిరిగానే గోరేబీ ఆదివారం కరన్‌కోట్‌కు వెళ్లి చిత్తు కాగితాలు సేకరించింది. భర్తతో కలిసి సాయంత్రం తాండూరులోని దొబీగల్లిలో స్క్రాప్ విక్రయించారు. వచ్చిన డబ్బులతో ఇద్దరూ గౌతాపూర్‌లో కల్లుతాగి ఆలయం వద్ద నిద్రించారు. ఈ సమయంలో తల్లి పక్కనే పడుకున్న చిన్న కుమారుడు హుస్సేన్(ఏడాది వయస్సు) ఉదయం కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు కరన్‌కోట్ పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. రాత్రి పడుకునే ముందు తన కొడుకును కొంగుతో కట్టేసుకున్నానని గోరేబీ తెలిపింది.

కొనసాగుతున్న దర్యాప్తు..

బాలుడు అదృశ్యమయ్యాడని ఫిర్యాదు అందడంతో అప్రమత్తమైన ఎస్ఐ విఠల్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి గౌతాపూర్ వెళ్లి, బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. గుడి వద్ద నిద్రించిన మరికొందరిని పిలిచి మాట్లాడారు. బాలుడిని ఎవరైనా ఎత్తుకెళ్లారా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్ఐ విఠల్‌రెడ్డి

పాఠశాలను పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ హరిజన్ చెర్రి ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి విద్యార్థులపై పెచ్చులూడిన ఘటనపై 'సాక్షి' దినపత్రికలో శనివారం 'పెచ్చులూడిన తరగతి గది', గతంలో 'దండం పెట్టి అడుగుతున్నాం' శీర్షికన వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఇందుకు స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు ఏఈ రవికిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ సోమవారం పాఠశాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు.



పెచ్చులూడిన తరగతి గదిని పరిశీలిస్తున్న ఆర్ అండ్‌బీ అధికారుల బృందం

ఇందిరమ్మ సర్వేలో ఇరువర్గాల ఘర్షణ

ఐదుగురికి తీవ్ర గాయాలు

- హైదరాబాద్‌కు తరలింపు
- ఘటనా స్థలిని పరిశీలించిన పోలీసులు



గాయలైన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

దోమ: ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తుండగా ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వికారాబాద్ జిల్లా దోమ మండలం గుండాలతండాలో సోమవారం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని అధికార పార్టీకి చెందిన వారు అధికారులకు సూచించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ మద్దతుదారులు కల్పించుకోవడంతో గొడవ మొదలైంది. ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వివాదాస్పదమైంది. దీంతో పలువురు నేతల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేసి, ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నం చేశారు. సహనం కోల్పోయిన ఇరువర్గాల వారు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో కాంగ్రెస్ మద్దతుదారులైన చందర్, సురేశ్, రవి, దేవమ్మ, రెడ్యానాయక్ తీవ్రంగా గాయపడగా, మాణిక్‌నాయక్, నార్యనాయక్, ఆకాశ్ స్వల్పంగా గాయపడ్డారు. వీరందరినీ పరిగి ఆస్పత్రికి తరలించగా చందర్, సురేశ్, రవి, దేవమ్మ, రెడ్యానాయక్‌ను మెరుగైన చికిత్స కోసం నగరానికి తీసుకెళ్లారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.



గుండాలలో ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఎస్ఐ ఆనంద్ కుమార్

చీటింగ్ కేసులో ఇద్దరికి ఏడాది జైలు

రూ.6వేల జరిమానా

పూడూరు: చీటింగ్ కేసులో ఇద్దరికి జైలు శిక్షతో పాటుగా జరిమానా విధించారని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి సోమవారం తెలిపారు. చన్గోముల్‌కు చెందిన ఎం.రామచంద్రారెడ్డి, బందె సత్తార్‌ఖాన్ తనను మోసం చేశారని అంగడిచిట్టంపల్లికి చెందిన ఖాజామునీరుద్దీన్ 2012లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన అప్పటి ఎస్ఐ మక్సూద్‌అలీ కేసు అభియోగపత్రాలు కోర్టుకు సమర్పించారు. ఈ మేరకు పరిగి కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ నాగుల స్వప్న వాదనలు విని నేరం రుజువు కావడంతో రాచంద్రారెడ్డి, సత్తార్‌ఖాన్‌కు ఏడాది జైలు శిక్షతో పాటుగా రూ.6వేల జరిమానా విధించారని చెప్పారు.

హక్కులపై అవగాహన అవసరం

ఎంపీడీఓ అనురాధ

నవాబుపేట: కుల, మత, భేదాలు తగవని ప్రజలందరూ సమానమేనని ఎంపీడీఓ అనురాధ అన్నారు. సోమవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మాదిరెడ్డిపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజలంతా సామరస్యంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌కుమార్, ఆర్ఐ రజిత గ్రామస్తులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

తాండూరు రూరల్: సమాజంలో ఎవరి హక్కులకూ భంగం కలిగించొద్దని పౌరహక్కుల మండల అధికారి గోవింద్, కరన్‌కోట్ పీఎస్ ట్రైనీ ఎస్ఐ రాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కోటబాసుపల్లి పంచాయతీ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కుల,మత, వర్ణ భేదం, వివక్ష, అంటరానితనం రూపుమాపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోపి, పంచాయత కార్యదర్శి లాలప్ప, హెచ్ఎం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నాగర్జున పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



నవాబుపేట: మాదిరెడ్డిపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ అనురాధ

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

యాలాల: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని యాలాల ఎస్ఐ గిరి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని పగిడియాలలో తహసీల్దార్ అంజయ్యతో కలిసి పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లాగా కలిసి ఉండాలన్నారు. పౌరులకు ఉన్న హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతీ ఒక్కరి సహకారం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం తదితరులు ఉన్నారు.



పూడూరు: మాట్లాడుతున్న ఎస్ఐ మధుసూదన్

చట్టాలు అందరికీ సమానం

పూడూరు: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉన్నప్పుడే సమస్యల్లో ఉన్న వారికి న్యాయం చేసేందుకు వీలుంటుందని చన్గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా నేటికి ప్రజల్లో చైతన్యం రాలేదని అన్నారు. సమాజంలో చట్టాలు అందరికీ సమానమన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, ఏఎస్ఐ సుభాష్, వార్డెన్ మోహినొద్దీన్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

తల్లీకూతురి అదృశ్యం




రేణుక (ఫైల్)



శ్రీలత (ఫైల్)

తాండూరు రూరల్: ఆరోగ్యం బాగోలేదని ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పిన తల్లీకూతురు అదృశ్యమైన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆత్కూర్ తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన కేతావత్ నరేష్, రేణుక దంపతులు. వీరికి ఆరేళ్ల కుమార్తె శ్రీలత ఉంది. ఆదివారం కూతురు ఆరోగ్యం బాగోలేదని ఆస్పత్రికి తీసుకెళ్తానని రేణుక భర్తకు చెప్పి వెళ్లింది. రాత్రి అయినా వారు తిరిగి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం నరేష్ పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తి అదృశ్యం



వెంకట్‌రెడ్డి(ఫైల్)

అనంతగిరి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వికారాబాద్ మండలం పీరంపల్లి గ్రామానికి చెందిన బందెనోళ్ల వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి ఈ నెల 24న రోజు మాదిరిగానే ఉదయం 9గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య లక్ష్మమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసినవారు 8712670030 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

పత్తి కొనుగోళ్లకు పరిమితి ఎత్తివేయాలి

- రైతుల మెరుపు ధర్నా
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ హామీతో శాంతించిన రైతులు

అనంతగిరి: పత్తి కొనుగోళ్లకు పరిమితిని ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ పట్టణానికి సమీపంలోని జిన్నింగ్ మిల్‌కు రైతులు పత్తి విక్రయించేందుకు పత్తిలోడ్‌లు తీసుకువచ్చారు. కాగా మిల్లు ప్రతినిధులు తాము రోజుకు 2వేల క్వింటాళ్ల మాత్రమతే కొనుగోలు చేస్తామని చెప్పడంతో వారు నిరాశతో వెనుదిరిగారు. అక్కడి నుంచి నేరుగా లోడ్ వాహనాలతో ఎన్నెపల్లి చౌరస్తాకు చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు తీసుకొచ్చిన పత్తిని నిబంధనలు ఎత్తివేసి కొనుగోలు చేయాలని భీష్మించుకున్నారు. మిల్లర్లు ఫర్టిలైజర్ దుకాణదారులు తీసుకువచ్చిన వాహనాలు ముందుకు పంపి కొనుగోళ్లు చేయడంతో తమ వంతు వచ్చేవరకు పరిమితి అయిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారులు కల్పించుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించి వాహనాలను పక్కకు తొలగించారు. రైతులు అక్కడి నుంచి నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ వెంటనే కల్పించుకుని సీసీఐ, మార్కెటింగ్ అధికారులకు పిలిపించుకుని రైతులు తీసుకువచ్చిన పత్తి మొత్తం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో అధికారులు రైతులు తీసుకువచ్చిన పత్తి వాహనాలను కొనుగోలు కేంద్రానికి తరలించారు.



ఎన్నెపల్లి చౌరస్తాలో ధర్నా చేస్తున్న పత్తి రైతులు

కల్వర్టుపై నుంచి కారు బోల్తా



కల్వర్టుపై నుంచి బోల్తాపడిన కారు

ఇద్దరు పర్యాటకులకు గాయాలు

ధారూరు: కల్వర్టుపై నుంచి కారు బోల్తాపడడంతో ఇద్దరు పర్యాటకులు గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం కేరెళ్లి శ్మశాన వాటిక సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కేరెళ్లి నుంచి వికారాబాద్ మీదుగా బుగ్గా టెంపుల్ రోడ్డులో ప్రయాణిస్తున్న ఓ కారు కల్వర్టుపై నుంచి బోల్తాపడింది. కాగా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు పేర్లు చెప్పేందుకు నిరాకరించారు.

నిత్యం ఇక్కడే ప్రమాదాలు

మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు వచ్చే పర్యాటకుల వాహనాలు ఇక్కడ తరచూ ప్రమాదానికి గురవుతున్నాయి. కల్వర్టు దగ్గర ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడం.. మలుపు ఉండడంతో వేగంగా వస్తున్న వాహనాలు అదుపుతప్పుతున్నాయి. ఈ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు కేరెళ్లి ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తాండూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పెద్దేముల్ మండల పరిధిలోని గిర్మాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దివిజా నాయక్(60) వ్యవసాయాధారిత కుటుంబం. కొన్నేళ్ల క్రితం ఆయన హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన దివిజానాయక్ ఇంటి ఆవరణలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్‌రెడ్డిని వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అత్యాచారం కేసులో జీవిత ఖైదు

దౌల్తాబాద్: అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధించిన సంఘటన సోమవారం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రవి గౌడ్ తెలిపిన ప్రకారం.. మండలంలోని చెల్లపూర్ గ్రామానికి చెందిన దాసరి గోవిందుపై దౌల్తాబాద్ పోలీసులు 2022లో పోక్సో సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. సోమవారం వికారాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి సీహెచ్.చంద్ర కిషోర్ కేసు వివరాలు పరిశీలించి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.1.50 లక్ష లు జరిమానా విధించారు. లేదంటే ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పు ఇచ్చారు.